# కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించాలి

- డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు
- నేటి నుంచి ఈ నెల 24 వరకు అవగాహన సదస్సులు



ఆశ కార్యకర్తలతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు

మంచిర్యాల ఏసీసీ, డిసెంబర్ 14 : కుటుంబ నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించాలని మంచిర్యాల జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి జీ సుబ్బారాయుడు అన్నారు. గురువారం మంచిర్యాల జిల్లా కలెక్టరేట్ సమీకృత భవనంలో జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో వైద్యాధికారులకు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆరోగ్య కార్యకర్తలకు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ కుటుంబ నియంత్రణ అవగాహన, శస్త్ర చికిత్సల పక్షోత్సవాల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా నేటి నుంచి ఈ నెల 24 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పురుషులకు కోతలు, కుట్లు లేని కుటుంబ నియంత్రణ ఆపరేషనే సరైనదని, ఈ విషయంలో భార్యాభర్తలు ఎవరూ ఎలాంటి అనుమానాలు పెట్టుకోవద్దని తెలిపారు. అనంతరం కార్యాలయంలో కరపత్రాలను, పోస్టర్లను విడుదల చేసి ఆశ కార్యకర్తలకు, పీహెచ్‌సీల నిర్వాహకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డెమో బుక్క వెంకటేశ్వర్లు, ఎస్‌వో వెంకటేశ్వర్లు, ఏఎస్‌వో దామోదర్, ఎల్‌డీ రాజేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

## పత్తి కొనుగోళ్లు బంద్

లక్షెట్టిపేట, డిసెంబర్ 14: లక్షెట్టిపేట పట్టణంలోని జిన్నింగ్‌మిల్లులో సీసీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పత్తి కొనుగోళ్లను నేడు, రేపు రెండు రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు సీసీఐ ఇన్‌చార్జి ఉదయ్ సాహు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం సెలవు దినం సందర్భంగా తిరిగి సోమవారం నుంచి కొనుగోళ్లు యధావిధిగా ఈ విషయం రైతులు గమనించి సహకరించాలని పేర్కొన్నారు.

## ఆలయ కమిటీ ఎన్నిక

హాజీపూర్, డిసెంబర్ 14 : మండలంలోని నంనూర్ పునరావాస కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీఅభయాంజనేయస్వామి ఆలయ కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బేర పోచ య్య, ప్రధాన కార్యదర్శిగా పెద్దపెల్లి స్వామి, ఉపాధ్యక్షుడిగా ఒడ్డె బాలరాజు, సహాయ కార్యదర్శిగా ఒడ్డె శ్రీనివాస్, కోశాధికారిగా కారుకూరి తిరుపతి, కార్యనిర్వాహక సభ్యులుగా అత్తె తిరుపతి, ఒడ్డె రాజమౌళి, ఆకిరెడ్డి వెంకటేశ్ ఎన్నికయ్యారు. రాసమల్ల శ్రీనివాస్ గౌడ్, గోప్పు లింగయ్య ఆధ్వర్వంలో నిర్వహించారు. ఎన్నికైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ శివరాత్రి లోపు ఆలయ నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించేందుకు కృషి చేస్తామన్నారు.

# ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక




ప్రజావేదికలో పాల్గొన్న జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేషాద్రి, ఎంపీపీ

దండేపల్లి, డిసెంబర్14: దండేపల్లి మండలంలోని 31జీపీల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులపై గురువారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో డీఆర్‌డీవో శేషాద్రి ఆధ్వర్యంలో 13వ విడుత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు.ఈ సందర్భంగా 2022 నుంచి 2023 ఆర్థిక సంవత్సరంలో 31 జీపీల్లో రూ.2.18కోట్ల విలువ చేసే 258 ఉపాధిహామీ పనులపై క్షేత్రస్థాయిలో తనిఖీ చేసిన వివరాలను అధికారులు వెల్లడించారు. పంచాయతీల వారీగా డీఆర్పీలు వెల్లడించిన వివరాలను జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేషాద్రి అదనపు డీఆర్డీఏ దత్తారావు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేషాద్రి మాట్లాడారు. పలు పనుల్లో తేడాలు కనిపించడంతో నిర్లక్ష్యం చేసిన వారికి జరిమానాతో పాటు రికవరీ చేయాలని అధికారులను ఆదేశించారు. మస్టర్‌లో, రికార్డుల్లో వివరాలు సరిగ్గా నమోదు చేయకపోవడం, తదితర విషయాలను డీఆర్పీలు ప్రజావేదికలో వెల్లడించారు. నిబంధనలకు విరుద్ధంగా చేపిన పనులపై డబ్బును రికవరీ చేయాలని, సంబంధిత సిబ్బందికి నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, జడ్పీటీసీ గడ్డం నాగారాణి, ఎంపీడీవో మల్లేశ్, అంబుడ్స్‌మెన్ శివరామ్, క్వాలిటీ కంట్రోల్ అధికారులు, విజిలెన్స్ అధికారులు సురేశ్, కిరణ్, ఎస్‌క్యూసీ చంద్రశేఖర్, ఎస్ఆర్పీలు, డీఆర్పీలు పాల్గొన్నారు.

## ఆవిర్భావ వేడుకలకు ఏర్పాట్లు చేయాలి

- శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి



మాట్లాడుతున్న జీఎం సంజీవరెడ్డి

సీసీసీ నస్పూర్, డిసెంబర్ 14: ఈనెల 23న శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియంలో నిర్వహించే సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేయాలని జీఎం సంజీవరెడ్డి అధికారులకు సూచించారు. గురువారం సాయంత్రం ఆయన అధికారులతో ఆవిర్భావ వేడుకలపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం జీఎం మాట్లాడుతూ ఉదయం జీఎం కార్యాలయంలో జెండా ఆవిష్కరించిన అనంతరం ప్రగతి స్టేడియంలో జెండాను ఆవిష్కరించి స్టాల్స్ ప్రారంభిస్తామని తెలిపారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు, ఉత్తమ గృహాలకు బహుమతులు, సింగరేణి శ్రీరాంపూర్ ఏరియా ఉత్తమ ఉద్యోగులకు సన్మాన కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఎస్వోటూజీఎం రఘుకుమార్, ఏరియా ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఫైనాన్స్ ఏజీఎం మురళీధర్, ప్రాజెక్ట్ ఆఫీసర్లు శ్రీనివాస్, పురుషోత్తంరెడ్డి, ఏజెంట్లు ఏవీ రెడ్డి, గోపాల్‌సింగ్, రాముడు, డీజీఎంలు అరవిందరావు, ఆనంద్‌రావు, చిరంజీవులు, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డి, సీనియర్ పీవో కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతిలో వంద శాతం ఉతీర్ణత సాధించాలి

- డీటీడీవో మడావి గంగారం



గిరిజన అశ్రమ పాఠశాలలో మాట్లాడుతున్న డీటీడీవో గంగారాం

జన్నారం, డిసెంబర్ 14 : పదవ తరగతిలో వంద శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని డీటీడీవో మడావి గంగారాం పేర్కొన్నారు. గురువారం మండలంలోని కవ్వాల్ బాలికల గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించి మాట్లాడారు. ముందుగా విద్యార్థులతో ఇంగ్లిష్ పాఠ్యాంశంపై విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలను తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపి అందరూ ఉతీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు పాటుపడాన్నారు. ఆయన వెంట ఏసీఎంవో రాజమౌళి, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నోటీసులు ఇవ్వకుండానే కూల్చివేయడం అన్యాయం



మాట్లాడుతున్న బాధిత దళిత కుటుంబాలు

సీసీసీ నస్పూర్, డిసెంబర్ 14: నస్పూర్ సర్వే నంబర్ 42లో దళితులు నిర్మించుకున్న ఇళ్లను మున్సిపల్, రెవెన్యూ అధికారులు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే కక్షపూరితంగా తమ ఇండ్లను కూల్చివేడయం అన్యాయమని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల సర్వేనెంబర్ 42లో మున్సిపల్, రెవెన్యూ అధికారులు దళిత అసైన్డ్‌దారులు కట్టుకున్న ఇండ్లను కూల్చివేశారు. దీంతో గురువారం బాధిత కుటుంబాలు భూమి వద్దకు చేరుకుని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ 1964లో సర్వేనంబర్ 42లో ప్రభుత్వం తమకు భూమిని సాగు చేసుకోవడానికి అసైన్డ్ చేసిందన్నారు. ఏళ్ల తరబడి సాగు చేసుకున్న భూమిని అప్పటి ప్రభుత్వం టీఎన్‌జీవోస్‌కు కేటాయించిందని, దీంతో తాము 2010లో హైకోర్టును ఆశ్రయించడం జరిగిందన్నారు. కొంత మంది టీఎన్‌జీవోస్ పెద్దలు తమతో చర్చలు జరిపి ఇందులో నుంచి రెండు ఎకరాల భూమి ఇస్తామని ఒప్పందం చేసుకున్నారని తెలిపారు. తమకు కేటాయించిన భూమిలో ఇండ్లు కట్టుకోవడానికి మున్సిపాలిటీలో అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్నామని అన్నారు. ఇళ్లు కట్టుకుంటున్న సమయంలో అడ్డు చెప్పని అధికారులు నిర్మాణం పూర్తి అవుతున్న దశలో పథకం ప్రకారం కక్షపూరితంగా కట్టుకున్న ఇండ్లను కూల్చివేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం బాధితులు జిల్లా అదనపు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.

## చదువుతో ఆర్థిక సామాజిక అభివృద్ధి

- ఐటీడీఏ డీటీడబ్ల్యూవో గంగారం



మాట్లాడుతున్న డీటీడబ్ల్యూవో గంగారం

జన్నారం, డిసెంబర్ 14 : చదువుతోనే గిరిజనులు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అభివృద్ధి చెందుతారని ఐటీడీఏ డీటీడబ్ల్యూవో గంగారం అన్నారు. గురువారం మండలంలోని మొర్రిగూడలోని గోండుగూడలో ఉన్న ఐటీడీఏ ప్రాథమిక పాఠశాలను పునర్ ప్రారంభించి మాట్లాడారు. కాలనీలోని పిల్లలందరినీ తప్పనిసరిగా ప్రతి రోజూ పాఠశాలకు పంపించాలన్నారు. పాఠశాలకు వచ్చిన పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని సౌకర్యాలను కల్పించినట్లు తెలిపారు. తమ పిల్లలందరూ పాఠశాలలకు వచ్చేలా తల్లిదండ్రులు చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బీ రాజగోపాల్‌నాయక్, ఏసీఎంవో రాజమౌళి, ఎస్‌పీఎల్ ఆఫీసర్ శంకర్, ఎస్సీఆర్పీ రఘునాథన్, టీచర్లు మారు, బీ రాజారాంనాయక్, కాలనీలోని విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మహిళా సాధికారత అవగాహన సదస్సు

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 14 : మంచిర్యాల డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ చక్రపాణి అధ్యక్షతన మహిళా సాధికారత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జెండర్ స్పెషలిస్టులు విజయ, రమ్య, సఖీ సెంటర్ నిర్వాహకులు చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సింగరేణి ఆధ్వర్యంలో ఆటల పోటీలు



శ్రీరాంపూర్‌లో టగ్‌ఆఫ్ వార్ పోటీలు ప్రారంభిస్తున్న సేవా సమితి అధ్యక్షురాలు రాధాకుమారి

శ్రీరాంపూర్, డిసెంబర్ 14 : సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా శ్రీరాంపూర్ కాలనీ ప్రగతి స్టేడియంలో సింగరేణి మహిళలకు, పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించారు. పోటీలను సేవా సమితి అధ్యక్షురాలు రాధాకుమారి ప్రారంభించారు. మహిళలకు టగ్ ఆఫ్ వార్, బాల్ ఇన్ బాస్కెట్, పిల్లలకు పాసింగ్ బాల్, త్రో బాల్, బాంబ్ బ్లాస్ట్, 50 మీటర్ల పరుగు పాటీలు నిర్వహించారు. దీపాలంకరణ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాధాకుమారి మాట్లాడుతూ పోటీల్లో విజేతలకు ఈ నెల 23న జరిగే సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో జీఎం సంజీవరెడ్డి బహుమతులు ప్రదానం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా సేఫ్టీ ఆఫీసర్ శ్రీధర్ సతీమణి సూర్యలక్ష్మి, లా ఆఫీసర్ ప్రబంధిత, సీనియర్ పీవో కాంతారావు, సీనియర్ పీవో శాంతన్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ చాట్ల అశోక్, కో ఆర్డినేటర్ తోట సురేశ్, సేవా సమితి కో ఆర్డినేటర్ కొట్టె జ్యోతి, సభ్యులు లత, హేమ, భవానీ, మల్లీశ్వరి, శారద, తిరుమల, ప్రమీల పాల్గొన్నారు.

## హక్కుల సాధనకు ఐఎఫ్‌టీయూ కృషి

శ్రీరాంపూర్, డిసెంబర్ 14 : సింగరేణిలో కార్మిక హక్కులు పరిరక్షణకు కృషి చేశామని, తెలంగాణ గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ వెంకటేశ్వర్రావు పేర్కొన్నారు. గురువారం శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు జీ రాములు, ప్రధాన కార్యదర్శి పోషమల్లు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బ్రహ్మానందం, ప్రధాన కార్యదర్శి సీతారామయ్య, నాయకులు చాందపాషా, కృష్ణ, మల్లేశ్, రత్నకుమార్, జాఫర్, సంతోష్, మల్లయ్య తదితరులున్నారు.

## మిత్రుడి పిల్లలకు సాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న మిత్రులు

దండేపల్లి, డిసెంబర్14:లక్షెట్టిపేట మండలంలోని ఎల్లారం గ్రామానికి చెందిన మల్లికార్జున్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చనిపోయాడు. భర్త మృతిచెందడంతో మనస్తాపం చెందిన భార్య శరణ్య కూడా కొద్ది రోజుల క్రితం ఆత్మహత్య చేసుకుంది. తల్లిదండ్రులు ఇద్దరిని కోల్పోవడంతో వారి ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. మల్లికార్జున్‌తో పాటు దండేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి(2006-07) చదువుకున్న చిన్ననాటి స్నేహితులు రూ.30వేల ఆర్థిక సహాయం మల్లికార్జున్ పిల్లలు ఇవాంక, ఓంకార్‌కు అందించి ఔదార్యం చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో బాల్య మిత్రులు ఉన్నారు.